క్లుప్తంగా

ఆకస్మిక తనిఖీ



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఉపవిద్యాశాఖాధికారి చంద్రశేఖర్

పూతలపట్టు: మండలంలోని పోలవరం ఉన్నత పాఠశాలను శుక్రవారం జిల్లా ఉపవిద్యాశాఖాధికారి చంద్రశేఖర్ తనిఖీ చేశారు. ముందుగా తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల నోట్‌బుక్‌లు, రోజువారీ హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ మార్చిలో రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలు దగ్గరపడుతుండడంతో కష్టపడి చదవాలని సూచించారు. మంచి ఉత్తీర్ణులై పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల విషయంలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహించకూడదని తెలిపారు. విద్యార్థులకు పాఠాలు బోధించకుండా కాలక్షేపం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విషజ్వరాలపై అప్రమత్తంగా వ్యవహరించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

చిత్తూరు రూరల్: విషజ్వరాలపై అప్రమత్తంగా వ్యవహరించాలని డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి అన్నారు. నగరంలోని వినాయకపురం ప్రాంతంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడేను నిర్వహించారు. కురుస్తున్న వర్షాలకు విషజ్వరాలు వస్తున్నాయన్నారు. జ్వరాల కేసులను గుర్తించి వెంటనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స అందేలా చూడాలన్నారు. చిన్న పిల్లల పట్ల మరింత జాగ్రత్తలు అవసరమని, జ్వరాల వ్యాప్తిపై అవగాహన కల్పించాలని ఆమె సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

చిత్తూరు రూరల్: నగరంలోని వన్‌డిపోలో శనివారం డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రయాణికులు 9959225674కు ఫోన్ చేసి డిపో పరిధికి సంబంధించిన సమస్యలను తెలియజేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

తహసీల్దార్లకు అంగన్‌వాడీల విన్నపం



వినతిపత్రాలను అందుకుంటున్న తహసీల్దార్ విజయభాస్కర్

పూతలపట్టు: మండలంలోని తహసీల్దార్ విజయభాస్కర్‌కు కార్యాలయంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె జరుగుతుండగా అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పంచాయతీ కార్యదర్శులు తీసుకోవడం బాధాకరమని తహసీల్దార్‌కు తెలిపారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ సమ్మెలో పాల్గొంటే అంగన్‌వాడీ కేంద్రాలకు ఎందుకు తాళాలు వేయాలని కార్యకర్తలను ప్రశ్నించారు. దీని వల్ల పిల్లలు ఇబ్బందిపడతారని తెలిపారు. అనంతరం వినతి పత్రాన్ని స్వీకరించారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న సభ్యులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం గంగినేని పార్కులో శుక్రవారం పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళి అర్పించారు. పొట్టి శ్రీరాములు విగ్రహ కమిటీ సభ్యులు పూలమాలవేసి పూజలు చేశారు. 58 రోజుల ఆమరణ నిరాహారదీక్ష చేసి ఆంధ్రరాష్ట్ర అవతరణకు విశేష కృషి చేశారని పొట్టి శ్రీరాములును కొనియాడారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు కట్టమంచి బాలక్రిష్ణారెడ్డి, సభ్యులు అరుణకుమారి, సహదేవనాయుడు, శ్రీధర్‌రెడ్డి, రాజేంద్ర, అమర్‌నాథ్, శ్రీహరి, రమేష్, భాస్కర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

21న భగవద్గీత కంఠస్థ పోటీలు

చిత్తూరు రూరల్: గీతాజయంతి మహోత్సవాన్ని పురస్కరించుకుని టీటీడీ ఆధ్వర్యంలో ఈ నెల 21న శ్రీమద్భగవద్గీత కంఠస్థ పఠన పోటీలు నిర్వహించనున్నట్లు భద్రవతి తెలిపారు. చిత్తూరు నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించే ఈ పోటీలకు 7వతరగతి నుంచి డిగ్రీ చదివే విద్యార్థులు అర్హులన్నారు. శ్లోకాలు, అధ్యాయాలకు సంబంధించి పోటీలు ఉండగా, ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు బహుమతి ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

చిత్తూరు: వన్నియర్‌బ్లాక్ సచివాలయ పరిధిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, బంగారుపాళెం: వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ అమరావతి, పార్టీ శ్రేణులు





పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం

- రాష్ట్రంలో పారదర్శక పాలన
- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- మమ్మరంగా కొనసాగుతున్న వై ఏపీ నీడ్స్ జగన్

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చాక పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో పారదర్శక పాలన సాగుతోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం వన్నియర్ బ్లాక్ సచివాలయపరిధిలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తొలుత సచివాలయంలో సంక్షేమ పథకాల లబ్ధిని తెలిపే బోర్డును, కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల ఎంతో మంది పేదల జీవితాల్లో వెలుగు నిండాయన్నారు. ప్రతి చిన్న విషయాన్ని టీడీపీ తన రాజకీయ చేయడం పరిపాటిగా మారిందని చెప్పారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్న సీఎం కావాలని చెప్పారు. ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు మాయలోడు వేషంలో వస్తారని, ఇక్కడ మాయమాటలు చెప్పి, ఎన్నికలయ్యాక మళ్లీ తెలంగాణకు వెళ్లిపోతారని చెప్పారు. వారి మాటలు నమ్మే పరిస్థితుల్లో ఎవరూ లేరన్నారు. ప్రజలందరూ సంక్షేమం అభివృద్ధిని ప్రత్యక్షంగా చూస్తున్నారని, రెండోసారి జగనన్నను సీఎం చేయడానికి సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షులు జ్ఞానజగదీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ కిరణ్, నాయకులు అప్పు, నారాయణ, చాన్‌బాషా, మున్నా తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

బంగారుపాళెం: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి అన్నారు. మండలంలోని తగ్గవారిపల్లె గ్రామ సచివాలయంలో శుక్రవారం సాయంత్రం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని చేపట్టారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా చేకూరిన లబ్ధి వివరాల బోర్డును ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ, అర్హులైన లబ్ధిదారులందరికీ అవినీతికి తావులేకుండా గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రభుత్వం నేరుగా సంక్షేమ పథకాలను అందజేస్తోందన్నారు. జెడ్పీటీసీ సోమశేఖర్ మాట్లాడుతూ, పేదలకు మేలు జరుగుతుంటే ఓర్వలేని చంద్రబాబు విషం చిమ్ముతున్నారని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించి జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలన్నారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, సీఎం చేసిన మేలును ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వాణీప్రియ, ఎంపీటీసీ సభ్యుడు హేమచంద్ర, కో–ఆప్షన్ సభ్యుడు ఫిరోజ్ అహ్మద్, ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్, ఎస్‌ఆర్‌ఐ భరత్‌రెడ్డి, బీసీ నాయకుడు సురేంద్ర, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ దుర్గాప్రసాద్ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల సంతోషమే జగనన్న లక్ష్యం

తవణంపల్లె: ప్రజల సంతోషమే లక్ష్యంగా సీఎం జగన్మోహన్ రెడ్డి పాలన అందిస్తున్నారని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు సి.హరిరెడ్డి తెలిపారు. మండలంలోని వెంగంపల్లె సచివాలయంలో శుక్రవారం సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డును అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రారంభించారు. తర్వాత మా నమ్మకం నువ్వే జగనన్న కిట్లను వలంటీర్లకు, గృహసారథులకు అందజేశారు. తర్వాత వెంగంపల్లెలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల ద్వారా ఆయా కుటుంబాలు అందుకున్న లబ్ధిని వివరించారు. మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పరమేశ్వర రెడ్డి, రవిరెడ్డి, ప్రకాష్‌బాబు రెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, మధుకుమార్, సుధాకర్, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.







బంగారుపాళెం: సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు, తవణంపల్లె: వెంగంపల్లెలో సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభిస్తున్న అధికారులు, కిట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భక్తి శ్రద్ధలతో అయ్యప్ప అంబళం పూజ



పూజలు నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

బంగారుపాళెం: స్థానిక ముత్యాలమ్మ ఆలయం ఆవరణలో గురువారం రాత్రి అయ్యప్పస్వామి భక్తులు అంబళం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అరటి పట్టలతో ప్రత్యేకంగా మండపం ఏర్పాటు చేసి అయ్యప్పస్వామి చిత్రపటాన్ని కొలువు దీర్చారు. భజనలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. శుక్రవారం ఉదయం ఇరుముడులు కట్టి స్వామివారిని దర్శించుకునేందుకు శబరిమలకు బయలుదేరి వెళ్లారు.

పకడ్బందీగా ఓటర్ల నమోదు



విలేకర్లతో మాట్లాడుతున్న ఈఆర్వో శివయ్య

పూతలపట్టు: మండలంలో ఓటరు నమోదును బీఎల్వోలు పకడ్బందీగా నమోదు చేశారని ఈఆర్‌ఓ శివయ్య తెలిపారు. ఆయన శుక్రవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, మండలంలో బీఎల్వోలు ఫారం 6, 7, 8 లోని ఓటర్ల వివరాలను పరిశీలించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 260 పోలింగ్ స్టేషన్ పరిధిలో కూడా బీఎల్వోలు నిర్లక్ష్యం వహించకూడదని తెలిపారు. జనవరి 5 వతేదీన ఓటరు తుది జాబితా విడుదల కానుందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ వచ్చేవరకు ఓటరు నమోదులో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపు చేద్దాం

చిత్తూరు కార్పొరేషన్: భవిష్యత్ తరాల అవసరాలకు అందరూ విద్యుత్‌ను పొదుపు చేద్దామని ట్రాన్స్‌కో ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. ఇంధన పొదుపు వారోత్సవాలను పురస్కరించుకొని స్థానికంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఇంధనాన్ని వృథా చేయవద్దు– మన అభివృద్ధిని మనమే అడ్డుకోవద్దు, విద్యుత్ పొదుపుతో జగతికి మేలు, ఇంటింటా కరెంటు పొదుపు ఊరుకు వెలుగు, రోజుకు ఒక యూనిట్ పొదుపు చేయాలని ప్లకార్డులను ప్రదర్శించారు. సంప్రదాయేతర ఇంధన వనరుల మీద ఆధారపడటం దశలవారీగా అలవాటు చేసుకోవాలన్నారు. భవిష్యత్‌లో ఈ–వాహనాల వాడకం పెరుగుతుందని అప్పుడు ప్రతి ఒక పనికీ విద్యుత్ తప్పనిసరి అవసరమవుతుందన్నారు.



ర్యాలీగా వెళ్తున్న ఉద్యోగులు

కార్యక్రమంలో డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్, ఏఈలు రాజేంద్రబాబు, బాలచంద్ర, కేశవులు, మహమ్మద్, కేశవచంద్ర, లోకేష్, నీరజ, మాధురి, ఉద్యోగ సంఘాల నాయకులు యజ్ఞేశ్వరరావు, గోవిందరాజులు, విద్యాసాగర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పోరాట యోధుడు సాబ్జీ

ఐరాల: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ పోరాట యోధుడు అకాల మరణం చెందడం యూటీఎఫ్ సంఘానికి తీరని లోటు అని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఆయన చిత్రపటానికి మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. సోమశేఖర్‌నాయుడు మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లా ఉండి వద్ద కారు ప్రమాదంలో ఆయన మృతి చెందడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి, ఏకాంబరం, మండల యూటీఎఫ్ అధ్యక్షుడు సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి లీలావతి, మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కుష్టువ్యాధిగ్రస్తులకు ఎంసీఆర్ చెప్పులు పంపిణీ

యాదమరి: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న కుష్టువ్యాధి గ్రస్తులకు యాదమరి ప్రభుత్వాస్పత్రి సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, డీపీఎంఓ మణి అందించారు. మండలంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం కుష్టువ్యాధి గ్రస్తులకు సీహెచ్‌ఓ, డీపీఎంఓలు తమ సొంత నిధులకు ఎంసీఆర్ చెప్పులు అందించారు. అనంతరం వారితో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వాస్పత్రుల ద్వారా కుష్టు వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు అందిస్తున్నారని చెప్పారు. క్రమం తప్పకుండా వాడితే నయం అవుతుందన్నారు. చాల వరకు మందులు సక్రమంగా వాడకపోతే వైకల్యం వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామంలో పర్యటిస్తున్న వైద్య సిబ్బంది

ఫెన్సింగ్‌లో యాదమరి విద్యార్థుల ప్రతిభ





విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, క్రీడా దుస్తులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

యాదమరి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చిత్తూరు జిల్లా తరపున ఫెన్సింగ్ క్రీడల్లో యాదమరి ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు కర్నూలులో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెన్సింగ్ క్రీడలో పాల్గొన్నారు. 9వ తరగతి విద్యార్థినులు ఫాతిమా, పిరదౌస్, మోనిషా, యుగ భారతి, బాలుడు కార్తిక్, 8వ తరగతికి చెందిన దీక్షిత పాల్గొన్నారు. వీరిలో యుగభారతి, దీక్షిత వెండి పతకాలు సాధించారు. వీరు ఈ నెల 14 నుంచి 17 వరకు జరుగుతున్న ఎస్‌జీఎఫ్ ఫెన్సింగ్ పోటీల్లో రాష్ట్రం తరపున ఆడనున్నట్లు తెలిపారు. విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం గిరిరాజ, పీడీ రవి, ఉపాధ్యాయులు సన్మానించారు. క్రీడాకారులకు ఇంగ్లీష్ ఉపాధ్యాయునులు త్రివేణి, సుగుణ రూ.15 వేలు విలువ చేసే ఎలక్ట్రానిక్ జాకెట్స్ విరాళంగా అందించారు.

15 లీటర్ల సారా పట్టివేత

చిత్తూరు అర్బన్: యాదమరి మండలంలో సారా తరలిస్తున్న వ్యక్తిని శుక్రవారం ఎస్‌ఈబీ అధికారులు అరెస్ట్ చేశారు. అందిన సమాచారం మేరకు, దాడులు నిర్వహించగా గొంది వాండ్లవూరు సమీపంలో హరిబాబు(34) నుంచి ద్విచక్రవాహనంతో పాటు 15 లీటర్ల సారాను పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తిని అరెస్ట్ చూపించి రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ట్రైనీ ఏఈఎస్ శ్రీరాం, ఎస్‌ఐ మోహన్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన వాహనం, సారా

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



సమావేశంలో మాట్లాడుతున్న గుణశేఖర్

ఐరాల: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా ఆరోగ్య విద్యాధికారి గుణశేఖర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఎం కోమల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య విద్య కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని, రోజు వ్యాయామం చేయాలని, పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. జంక్‌ఫుడ్, నిలువ ఉంచిన పిండిపదార్థాలు తిన కూడదని తెలిపారు. రక్తహీనత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌ఓ సుగుణవతి, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి పాల్గొన్నారు.

దుకాణాలకు ఉచిత బోర్డులు



దుకాణంలో అమర్చిన వైఎస్సార్‌సీపీ బోర్డు

పూతలపట్టు: మండలంలో వైఎస్సార్‌సీపీ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు చొరవతో మండలంలోని దుకాణాలకు బోర్డులను ఉచితంగా అందజేశారు. మండలంలోని పలు దుకాణాలకు శుక్రవారం లైటింగ్ అమర్చిన బోర్డును అందజేశారు. దాదాపు 20 షాపులకు అమర్చారు. మిగిలిన దుకాణాలకు బోర్డులు రావాల్సి ఉంది. మండల పార్టీ నాయకులు, యువత అధ్యక్షులు నవీన్, నాగరాజు, సచివాలయ కన్వీనర్ ప్రకాష్ రెడ్డి, రాజేష్‌రెడ్డి, అమర్‌నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించండి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రతి ఒక్కరి మొబైల్‌లో డౌన్‌లోడ్ చేయించాలని ప్రాథమిక వైద్యాధికారి సంధ్య అన్నారు. ఆమె శుక్రవారం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు ఆరోగ్యశ్రీని పెంచినట్లు చెప్పారు. వీటిని గ్రామాల్లో విస్తృతంగా తెలియజేయాలన్నారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసినట్లయితే అందుకు సంబంధించిన వివరాలన్నీ అందులోనే ఉంటాయన్నారు.18వ తేదీ నుంచి కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అందజేయాలని ఆమె తెలియజేశారు.

హిందువులందరికీ అయోధ్య అక్షింతలు





బ్రహ్మానందాశ్రమానికి చేరిన అక్షింతలు, అయోధ్య అక్షింతలను గ్రామాలకు తీసుకెళుతున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని గ్రామాల్లో ప్రతి హిందూ కుటుంబానికి అయోధ్య రాముడి అక్షింతలు అందించాలని బ్రహ్మానందాశ్రమ నిర్వాహకుడు కేశవానంద స్వామి అన్నారు. మండలంలోని మాధవనగర్ బ్రహ్మానందాశ్రమంలో శుక్రవారం శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరాముని పూజిత పవిత్ర అక్షింతలు అందజేశారు. అక్కడి నుంచి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు అందజేశారు. కేశవానంద స్వామి మాట్లాడుతూ, 2024 జనవరి 22న అయోధ్యలో శ్రీరాముని ఆలయ ప్రారంభోత్సవం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జనవరి 1 నుంచి 15వ తేదీ లోపు గ్రామాల్లోని ప్రతి హిందూ బంధువు ఇంటికి అయోధ్య అక్షింతలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహక కమిటీ, విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

పిల్లలకు మనోధైర్యం అవసరం

యాదమరి: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందని, మనోధైర్యంగా ఉండాలని ఎస్‌ఐ మునస్వామి కోరారు. మండల కేంద్రంలోని భవితా సెంటర్‌లో శుక్రవారం జిల్లా హ్యూమన్ రైట్స్ గౌరవ అధ్యక్షులు పాస్టర్ రాబర్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల మధ్యన కేక్ కట్‌చేసి క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. దీనికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ ప్రసాద్, ఎస్‌ఐ మునస్వామి హాజరయ్యారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలతో కలసి సంబరాలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఎన్నో వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రుక్మిణీ, మనీ, రజాక్, భారతి, శరత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ మునస్వామి

నిరుపేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్





ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది, గుడిపాల: వైద్య సేవలు అందిస్తున్న డాక్టర రష్మిత

ఐరాల: మండలంలోని ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గ్రామీణ ప్రాంత నిరుపేదలకు వరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని సవటపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 75 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చేతుల శుభ్రంపై అవగాహన కల్పించి, ఆరోగ్య పరీక్షలు చేశారు. శీతకాలం ఉదయం సమయంలో తప్పనిసరిగా మాస్కు ధరించాలని తద్వారా నెమ్ముతో కూడిన సమస్యలు రావని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఏఎల్‌పురంలో..

గుడిపాల: మండలంలోని ఏఎల్‌పురం గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి రష్మిత 62 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భవతులు, బీపీ, మధుమేహ వ్యాధి గ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలు ఇచ్చారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భవతులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇంటి వద్ద మంచానికి గురైన రోగుల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీలక్ష్మి, కవిత, కాలీనమ్మ, రీటా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో నీతి ప్రతిభ

చిత్తూరు కలెక్టరేట్ : అన్నమయ్య జిల్లా మదనపల్లిలో నిర్వహించిన 67 వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ హాకీ క్రీడాపోటీల్లో నారాయణ పాఠశాల విద్యార్థిని నీతి ప్రతిభ చాటింది. అండర్ 14 హాకీ పోటీల్లో ప్రతిభ చాటిన ఆ విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యింది. ఆ విద్యార్థినిని శుక్రవారం జిల్లా కేంద్రంలోని నారాయణ కళాశాలలో ఏజీఎం అవధానం పణికుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏడీ జ్యోతీశ్వర్, పీఈటీ సుజాత పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న ఏజీఎం పణికుమార్